# పసి ముదిమి

● రచన: వి. రాజారామమోహనరావు ● చిత్రం: డి.ఎల్.ఎన్. రెడ్డి

ఆయన రిటైర్ అయి ఏడాదిన్నర అయింది. షష్టి పూర్తి దగ్గర పడుతోంది. ఆ ఇల్లు, ఆ ఇంట్లోని చాలా వస్తువులు ఆయన కష్టార్జితమే అయినా, వరండా లోని ఆ ఈజీచైర్ మాత్రం ప్రత్యేకంగా తనది అనిపిస్తుంది ఆయనకి.

ఉదయం లేచి ఆ కాంపౌండ్‌లో మొక్కల మధ్య తిరగడం దగ్గర నుంచి న్యూస్‌పేపర్ చదవడం, సాయంత్రం మళ్ళీ పచార్లు చెయ్యడం వరకు గడిచే ఆయన నిత్య కార్యక్రమంలో మధ్య మధ్య సేద తీర్చుకునేది ఆ కుర్చీలోనే. అలా అని ఆయన మానసిక, శారీరక ఆరోగ్యాలలో ఏ రకం బలహీనతా లేదు.

ఆరోగ్యం బాగుంది. గడపిన జీవితాన్ని కలగలిపి చూసుకుంటే, ఆయనకి తన జీవితం పట్ల గర్వం కాకపోయినా, సంతోషమే.

సత్తిగాడు, సత్యం, సత్యారావు, సత్యారావు గారు.... ఇలా గడచిన ఆయన జీవితపు అన్ని అధ్యాయాల్లోంచి ఆయనకి సాధారణంగా తృప్తికరమైన జ్ఞాపకాలే ఎక్కువ వస్తుంటాయి. కుటుంబ సుఖమే తన సుఖంగా గడపిన సాదా సీదా జీవితం ఆయనది.

గత నాలుగు రోజులుగా ఆయన, జీవితంలో ఎప్పుడూ ఎదురుచూడనంతగా ఎదురుచూస్తూ గడుపుతున్నారు. ఆ ఎదురుచూట్టానికి పెట్టిన గడువులో ఆఖరి రోజే అది.

ఆ గడువు పెట్టింది ఎవరో కాదు, సత్యారావు గారి ఏకైక పుత్రుడు వినోద్.

వదులుకోవాలని ఎంతగా ప్రయత్నించినా వదులుకోలేని వాటిలో బలమైనవి జ్ఞాపకాలేనేమో. కుర్చీలో కూచున్న సత్యారావు గారి ఆలోచనలో అవే కదులుతున్నాయి. ఆ జ్ఞాపకాలకి ఓ వరుసా, వావీ లేదు. ప్రత్యేకతా, అప్రత్యేకతా లేదు.

పండక్కని పుట్టింటికి వచ్చిన కూతురు లత, కొడుకు వినోద్...ఆ నాటి గడువు తాలూకు ఆత్రతకు సంబంధం ఉన్న గతం మాత్రం ఆయన స్ఫురణలో ప్రత్యేకంగా మెదలుతూ, ఆ జ్ఞాపకాల్లో కొన్నింటిని పూసగుచ్చుతోంది.

వినోద్‌కి ఇప్పుడు ముప్ఫై మూడేళ్ళు. సత్యారావు గారి ఆలోచన దరిదాపు ముప్ఫై ఏళ్ళ వెనక తచ్చాడుతోంది.

* * *

బందర్లో ఉంటున్న రోజులవి. వినోద్‌కి మూడో ఏడు నిండుతోంది. పుట్టిన రోజుకు పదిరోజులుంది. ఆఫీసు పని మీద బొంబాయి వెళ్ళాల్సివచ్చింది.

బొంబాయిలో ఆఫీసు పని పూర్తికాకపోతే, పుట్టినరోజు నాటికి వెనక్కి రాలేకపోతానేమో అన్న సందేహంతో ఆ ట్రిప్ ఎగ్గొట్టాలని చూశాడు సత్యం. సత్యం వ్యవహారం కనిపెట్టినవాడిలా పై ఆఫీసరు పిలిచాడు.

పిలిచి, ''టి.ఎ, డి.ఎ రూపేణా నాలుగు రాళ్ళు మిగులుతాయి. ఇలాంటి ట్రిప్స్ వదులుకోకూడదు. నా మాట విని వెళ్ళు. అంతగా పని అవకపోయినా, మీ అబ్బాయి పుట్టిన రోజుకి వచ్చేయి. మిగిలిన సంగతి నేను చూసుకుంటాను. అలాగే బర్త్‌డే ప్రెజంటేషన్ మంచిది బొంబాయి నుంచే తెచ్చుకో' అన్నాడు.

ఆయన చెప్పిన మిగిలిన విషయాలకన్నా కుర్రాడికి బొంబాయి నుంచి ఏదైనా తేవచ్చు అన్న పాయింటే బాగా నచ్చింది సత్యానికి. వెంటనే ప్రయాణానికి ఒప్పుకున్నాడు.

ఓ చిత్రమైన అనుభవ సంధ్యలో ఉన్న రోజులవి సత్యానికి. తన బాల్యం, తన తల్లితండ్రులు, యౌవనానుభవం, సంసారం - వీటి నుంచి తన తర్వాత అన్న మలుపులో..... కొడుకు ఓ అనుసృజన అన్న గమ్మత్తయిన మానవ సంబంధపు పులకింత తెలుస్తున్న కాలం.

వినోద్ రోజుల పిల్లాడిగా ఉన్నప్పట్నించీ తనతో ఏదో మాట్లాడుతున్నట్టు, కళ్ళు ఆర్పీ ఆర్పని చూపులతో ఏదో చెపుతున్నట్టు ఉండేది సత్యానికి. ఆఫీసు నుంచి తను రాగానే ఆ చిన్ని ముఖంలో పెద్ద నవ్వు. అర్ధ రాత్రి అయినా సరే, ఎంత నిద్దర్లో ఉన్నా సరే తన గొంతు కొంచెం గట్టిగా వినిపిస్తే, ఆ పసివాడు కళ్ళు తెరిచి తనని వెతుకుతున్నట్టు చూసే చూపు... అల్లీ బిల్లీ విషయాలన్నీ అమృతానుభవాలే.

ఆ చిన్న ప్రాణం కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధం అన్నట్టుండేది ఆ కాలం.

అలాంటి వినోద్‌కి కొంచెం ప్రపంచజ్ఞానం తెలుస్తున్న మూడో పుట్టిన రోజది. వాడి భావాలకి దగ్గరగా, వాడి అనుభవానికి వీలుగా ఆశ్చర్యంగా ఉండేది ఏదైనా కొనాలి. ఏమిటది?

బొంబాయి ట్రిప్‌లో ప్రధాన ఆలోచన అదే సత్యానికి. చాలాసార్లు బజారు వెళ్ళాడు. చివరికి సత్యం ఊహకు తగింది దొరికింది.

చిన్న విమానం బొమ్మ. కీ ఇస్తే కొద్ది ఎత్తున ఆ పరిసరాల్లోనే ఎగిరే విమానం. ఆ రోజుల్లో మూడు వందలు పెట్టి ఆ బొమ్మ తెచ్చాడు సత్యం. అంత ఖరీదు పెట్టి పిల్లాడికి ఆటబొమ్మ తేవటం వీధి వీధంతా చెప్పుకున్నారు.

వాళ్ళు చెప్పుకోడం కోసం కాదు, ఆ బొమ్మతో వినోద్ పొందే మురిపెం కోసం కొన్నాడు.

అదే జరిగింది. ఎక్కడో ఆకాశంలో ఎగిరే విమానాన్ని తండ్రి చూపిస్తే కలిగిన ఆశ్చర్యం - తన అనుభవంలో, తన చేరువలో ఉన్న భావన.

మాటల్లో చెప్పలేడు వినోద్. కానీ, గెంతుతూ, నవ్వుతూ ఆ విమానం బొమ్మని స్పృశిస్తూ, తండ్రిని కౌగిలించుకుంటూ తన అనుభవాన్నంతా తండ్రికి చూపించాడు.

అంత డబ్బు పెట్టినందుకో, కొడుకు ఆనందించినందుకో, వీధి వాళ్ళంతా గొప్పగా చెప్పుకున్నందుకో ... దేనికోసమో కచ్చితంగా తెలియకపోయినా....తెలుసుకోవాలని అనుకోకపోయినా, ఆ సంఘటన చాలాసార్లు గుర్తుకొస్తుంటుంది సత్యారావు గారికి.

అప్పుడు వినోద్‌తో గడిపినట్టే, ఇప్పుడు వినోద్ కొడుకుతో....తాతగా అలాగే గడుపుతున్నాడు. ఇందులోనూ హాయి ఉంది. కానీ, ఇది పునశ్చరణ లాంటిది. తొలి అనుభవం లాంటిది కాదు.

అందుకే కాబోలు ఇంకా ముప్ఫై ఏళ్ళ క్రితం నాటి జ్ఞాపకాలు...

శ్రమలో సుఖం అన్నది ఓ చిత్రమైన అనుభవం. పిల్లల కోసం శ్రమించడం కన్నా సుఖమైన అనుభవం మరోటి లేదన్నది సత్యారావు గారి భావన.

అలాంటిదే మరో సంఘటన -

వినోద్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కూతురు లత ఎనిమిదేళ్ళ పిల్ల. తన స్తోమతకి మించిన స్కూల్లోనే చేర్పించి పిల్లల్ని చదివిస్తున్న రోజులవి.

అనుకోని ఒత్తిడి వల్ల ఆ నెల స్కూలు ఫీజు కట్టలేదు. నెల తిరిగినా కట్టలేకపోయాడు. పిల్లలిద్దరి పేర్లూ రోల్‌కాల్ నుంచి కొట్టేసి ఇంటికి పంపించేశారు. అదేమంత బతుకుల్ని తలకిందులు చేసే సమస్య కాదు.

కానీ, ఆ రోజు వినోద్ చాలా చిన్నబుచ్చుకున్నాడు. వెక్కి వెక్కి ఏడ్వకపోయినా, వాడి కనుకొలకుల్లో తడి సముద్రంలా కనపడింది సత్యానికి. లత బిక్కు బిక్కుమంటూ ఏదో తప్పు చేసిందానిలా తల వంచుకునే నిలబడింది.

'ఛీ....ఇంకెప్పుడూ పిల్లలకు ఈ పరిస్థితి రానియ్యకూడదు. జాగ్రత్తగా ఉండాలి' అనుకుంటూ తనని తను ఎన్నో రకాలుగా నిందించుకున్నాడు సత్యం. ఆ తర్వాత వాళ్ళకి ఎప్పుడూ అలాంటి పరిస్థితి ఎదురవనివ్వలేదు.


వాళ్ళ అవసరాలే అన్నింటికన్నా ముఖ్యమైనవిగా సంసారం గడిపాడు. దానికి ఎంతగా శ్రమించినా, ఎన్ని గంటలు ఎక్కువ పనిచేసినా ఆనందంగానే భావించాడు.

ఈనాడు వాళ్ళిద్దరికీ ఏ లోటూ లేదు. వినోద్‌కి ఒక కొడుకు. లతకి ఒక కూతురు, కొడుకు.

కొడుక్కీ, అల్లుడికీ కూడా మంచి ఉద్యోగాలే.

ఇప్పుడు సత్యారావు గారికి పెద్దగా బాధ్యతలేం లేవు. ఆ విషయం ఆయనకీ తెలుసు.

వదులుకోవాలని ఎంతగా ప్రయత్నించినా వదులుకోలేని వాటిలో బలమైనవి జ్ఞాపకాలేనేమో.



వినోద్ తండ్రి గురించి ఎవరికైనా చెప్పేటప్పుడు, 'ఆయనకేం లోటు లేదు. ప్రశాంతమైన జీవితం - ఈజీచైర్ లైఫ్' అంటాడు.

అది అబద్ధం కాదు. నిజమే. కానీ, సత్యారావు గారిలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

'ఏ లోటూ లేదు. నిజమే. తను ఒంటరివాడు కాదు. పిల్లలు, మనవలే కాదు - ఇప్పటికీ అప్పటిలాగే చూసుకునే భార్య ఉంది. రోజులో ఎక్కువ సేపు కలసే గడుపుతుంటారు. ఏ ఒత్తిడీ లేదు. ఈజీ లైఫ్...కానీ, ఇంతేనా...ఇంక జీవితం ఇంతేనా...'

ఇలాంటి ఆలోచనలు వచ్చిన రోజు మాత్రం సాయంత్రాలు గతంలోకన్నా కొంచెం ఎక్కువ దిగులుగా అనిపిస్తుంటాయి సత్యారావు గారికి.

అది 'ఫలానా' అని చెప్పుకోలేని దిగులు. సాధారణంగా ఏ మనవడి అల్లరి తోనే, ఆఫీసు నుంచి వచ్చిన కొడుకు పలకరింపుతోనో ఆ దిగులు కరిగిపోతుంది. అలా కరిగిపోని రాత్రి మాత్రం సత్యంగారిని ఇబ్బంది పెట్టే ఆలోచన ఒకటుంది.

'ఎవరు ముందు?

తనే ముందు అయితే, భార్య పరిస్థితి ఏమిటి? ఇన్నేళ్ళ సాహచర్యం.... ఒంటరిగా ఎలా బతుకుతుంది? ఫరవాలేదు, వినోద్ ఉన్నాడు. పెన్షన్..... ఫిక్సెడ్ డిపాజిట్స్ మీద వడ్డీ భార్యకే అందుతాయి. లోటుండదు. ఒకవేళ అలాకాక భార్యే ముందు అయితే, ఒంటరిగా తను బతగ్గలడా?'

ఆ దిగులు మరీ ఘనీభవించకుండా....'మన చేతుల్లో ఏముందనీ. ఈ ఆలోచన అనవసరం. అంతా భగవదేచ్ఛ....దాని కోసం యోచన అనవసరం' అనుకుని నిద్రపోతున్న భార్యని లేపి కూచోపెట్టి ఏవేవో కబుర్లు ఆరంభించి ఆలోచనని మళ్ళించుకునేవాడు.

ఏదైనా అనుకున్న పని అనుకున్నట్టు జరగకపోతే ఏదో దిగులు. సరిగ్గా అలాంటి చెప్పుకోలేని దిగులే కలుగుతోంది సత్యారావు గారికి.

పండగకి లత వచ్చింది. ఏడాది తర్వాత పుట్టింటికి వచ్చిన కూతురూ, మనవలు. అసలే పండగ, దానికి తోడు వాళ్ళ సముఖం మరో పండగలా ఉంది సత్యారావుగారికి. బట్టలు కొన్నాడు. మనవరాలికి వెండి పట్టాలు కొన్నాడు. ఆడపిల్ల కదా అని చిన్న బంగారు గొలుసు కొన్నాడు. అదే చేత్తో మనవడికీ అలాంటి బంగారు గొలుసే కొన్నాడు.

వారం రోజులు పిల్లల్తోనుకుని పెద్దవాళ్ళిద్దరూ చిన్న పిల్లల్లా ఊరంతా తిరిగారు.

"నాన్నా, మా తిరుగు ప్రయాణానికి టికెట్లు రిజర్వ్ చేయించండి" అంది లత, తోడికోడలు ఇంటికి వెడుతూ.

"అలాగేనమ్మా" అన్నారు సత్యారావు గారు. ఇంకా నాలుగైదు రోజులు సమయం ఉంది.

బ్యాంక్‌కి వెళ్ళి చూస్తే సరిపడా డబ్బు లేదు. ఆయన పండగ ఉత్సాహం బ్యాంక్ బ్యాలన్స్‌ని కరిగించింది.

ఏం చెయ్యాలో తోచక నెమ్మదిగా భార్యతో చెప్పాడు.

"దానికంత దిగులెందుకండీ...టికెట్లకి లత, డబ్బు నాచేతికిచ్చింది" అంటూ ఆవిడ డబ్బిచ్చింది.

టికెట్లు రిజర్వ్ చేయించాడు.

అప్పటికి అవసరం తీరింది. కానీ, ఆయన మనసుకి తృప్తిగా లేదు. ఇన్నాళ్ళకి ఇంటికొచ్చిన పిల్లమీద తిరుగు ప్రయాణం బరువు పడనివ్వకూడదు. ఆడపిల్ల చేతిలో ఎంత డబ్బుంటే అంత ధైర్యం.

లతకి డబ్బు అవసరం అంతగా లేదని ఆయనకీ తెలుసు. అయినా, తండ్రిగా తాపత్రయం. అందుకే తప్పనిసరై వినోద్‌ని అయిదొందలు కావాలని అడిగాడు.

"అలాగే నాన్నా.....ఇస్తాను" అన్నాడు వినోద్.

ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉన్నారు సత్యారావు గారు. చివరికి మరోసారి అడిగారు. లత ఆ సాయంత్రమే వస్తుంది. తెల్లారగానే వెళ్ళిపోతుంది.

వినోద్ డబ్బిస్తానన్నది ఆ సాయంత్రమే.

పెద్ద సమస్య కాదు. కానీ, బాగా ఇబ్బందిగా ఉంది. సత్యారావుగారి ప్రాణానికి సుఖంగా లేదు.

వరండాలోని కుర్చీలో చాలా సార్లు కూచున్నారు. అసహనంగా కదుల్తూ చాలాసార్లు లేచారు. పచార్లు చేశారు. ఎలాగైతేనేం, సాయంత్రం అయిందనిపించారు. వినోద్ రాకకోసమే చూస్తున్నారు.

'కొడుకు డబ్బివ్వగానే జాగ్రత్తగా లతకి ఇవ్వాలి. వెర్రిపిల్ల... ప్రయాణం ఖర్చులు అది పెట్టుకోటమేమిటి?' అదే ఆలోచన.

వినోద్ వస్తున్న చప్పుడయితే ఆత్రతగా కుర్చీలోంచి లేచారు. ఎప్పుడూ దేనికీ అంతగా ఆత్రతపడినట్టుగా లేదు ఆయనకి.

తండ్రిని చూస్తూనే "నాన్నగారూ, ఇవాళ కూడా తేలేకపోయాను. ఈ నెల ఖర్చులన్నీ ఒకేసారి వచ్చి చాలా ఇబ్బంది పెట్టాయి. రెండు రోజుల్లో ఇస్తా. కొంచెం సర్దుకోండి. అయినా, నాలుగు రోజుల్లో ఎలాగా మీ పెన్షన్ వస్తుందిగా" అన్నాడు.

నిస్సత్తువ ఆవరించినట్టు తిరిగి కుర్చీని ఆశ్రయించారు. కొడుకు అన్నట్టుగా ఆ వాలుకుర్చీ జీవితం ఈజీ లైఫ్‌లా అనిపించలేదు, ఆ క్షణాన సత్యారావుగారికి. 'ఇంత బతుకూ బతికి, ఇన్నేళ్ళూ శ్రమించి, చివరికి పిల్లకి ఈ మాత్రం చెయ్యలేని

అసమర్థుణ్ణి అయిపోయానా' అనిపించింది.

ఏమిటంత దిగులు? అంటే ....ఇదీ నమస్య అని చెప్పుకోలేని పరిస్థితి.

ఒకవేళ చెప్పుకున్నా "ఏమిటి నీ చాదస్తం...లతకి పోనీ డబ్బు ఇబ్బంది ఉందంటే దిగులు పడొచ్చు. దానికి లేని బాధ అనవసరంగా నువ్వు పడుతున్నావు" అంటారు.

అంతేతప్ప ఏదో చేయాలన్న తన తపననీ, తండ్రిగా ఈ వయసులో ఉండే ఆరాటాన్నీ గమనించరు.

వల్సటి చీకట్లో కూచున్న నత్యారావు గారి దగ్గరగా వచ్చింది ఆయన భార్య.

ఆయన భుజం మీద కాకుండా ఈజీ ఛైర్ మీద చెయ్యి వేసింది. సాహచర్యం కొన్ని విషయాల్ని బాగా అర్థం అయ్యేలా చేస్తుంది. ఆవిడ పొద్దున్నించీ ఆయనని పరికిస్తూనే ఉంది. కొడుకు రాకకోసం ఆయనతో పాటు ఆవిడా ఆత్రతగానే ఎదురుచూసింది.

"పోనీలెండి. మీ పెన్షన్ రాగానే ఏదో వంకని లతకి పంపుదాంలెండి" అంది ఆవిడ నెమ్మదిగా, ఆయన భుజం మీదకి చెయ్యిని జరుపుతూ..

అంతవరకూ దిక్కు తోచనట్టు ఉక్కిరి బిక్కిరిగా ఉన్న ఆయనకి కొంచెం ఊపిరి ఆడింది. తన భుజం మీద వాలిన ఆప్యాయతని తృప్తిగా ఆలోచనలోకి తీసుకున్నారు.

లైటు వెలిగినట్టు ఆయన మననూ వెలిగింది.

'నిజమే, అలాగే చెయ్యొచ్చు. అయినా, ఇందులో వినోద్ తప్పు మాత్రం ఏముంది. ఫలానా అవసరం అని చెప్పి తను డబ్బు అడగలేదు. పండగ ఉత్సాహంలో పెద్దవాడు తనే వెనకా ముందూ చూసుకోకుండా ఖర్చు చేశాడు. వాడికి మాత్రం పండగ కాదా ....... ఇబ్బందులుండవా.....'

ఆ ఆలోచనతో పరిస్థితి అంతా తేలిగ్గా మారిపోయింది. సర్దుబాటు కుదిరిపోయింది.

> చిన్నపిల్లలకి ఎత్తు ఎలాంటిదో, పసి ముదిమి లోని పెద్దవాళ్ళకి తమ వాళ్ళు కనబరిచే శ్రద్ధ అలాంటిది.

'ఇంకా అమ్మాయి రాలేదేం చెప్మా' అనుకున్నాడు.

జీవితంలో చాలాసార్లు సర్దుబాట్లు చేసుకున్నారు నత్యారావు గారు. సర్దుబాటు కుదిరాక అంతా బాగానే ఉన్నట్టు అనిపిస్తుంది. 'పోనీలే, ఏదో ఇబ్బందిలే...' అని తన వాళ్ళనందరినీ. సమర్థించుకుంటూనే వచ్చారు. దానికి ఆయన భార్య సహకారం కూడా ఉంది.

తమ వయసు వాళ్ళు చాలా మంది పడుతున్న రకరకాల ఇబ్బందుల్ని ముచ్చటించుకుంటూ ఆ భార్యాభర్తలిద్దరూ తమ తృప్తిని ఇనుమడింప జేసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి.

వార్ధక్యంతో అలిసిపోయిన శరీరాలకి తగిన వైద్యం లేక, ఏదోకానీ సరిపడని జిహ్వాకి కుదిరే తిండి లేక, అయినవాళ్ళ ఆదరణ మాట అలా ఉంచి, తగిన సానుభూతి కూడా లేక, ఎందుకు బతుకుతున్నారో కూడా తెలియని చాలా మంది తోటి ముసలివాళ్ళ గురించి వాళిద్దరికీ చాలా తెలుసు.

తన వాళ్ళ నీడన జీవితం వెళ్ళిపోవడంలో ఉన్న అదృష్టం విలువ గురించి కూడా వాళ్ళకి తెలుసు. కానీ, చాలామంది కుర్రాళ్ళలాగే వినోద్‌కే ఇంకా అర్థం కాలేదు. తన ఇబ్బందులన్నింటినీ కంటికి రెప్పలా జీవితమంతా కాపు కాచిన, కాస్తున్న తండ్రికీ తల్లికీ ఇబ్బందులుంటాయని అతనికి తట్టలేదు. వాళ్ళ విషయంలో ఏ చిన్న సంగతికైనా ఎంతో ప్రాముఖ్యం ఇవ్వాలన్న దృష్టి అతనిలో లేదు.

చిన్నపిల్లలకి ఎత్తు ఎలాంటిదో, పసి ముదిమిలోని పెద్దవాళ్ళకి తమ వాళ్ళు కనబరిచే శ్రద్ధ అలాంటిది.

వినోద్ కొంచెం మనసుపెడితే తండ్రి అడిగిన అయిదొందలు ఇవ్వగలిగే వాడే. ఇచ్చి ఉంటే జీవితంలో ఏనాడూ విమానం ఎక్కని నత్యారావు గారు విమానం ఎక్కినంత సంబరపడి ఉండేవారు. ఆ సంబరం చెయ్యి జారడం దురదృష్టమే మరి. ■


DAP బ్రాహ్మీవిట



జ్ఞాపకశక్తికి మనోవికాసానికి

మరుకైన జ్ఞాపకశక్తికి మరియు బుద్ధివికాసానికి ఆయుర్వేదంలో పేరెన్నికగల బ్రాహ్మి మరియు శంఖపుష్పిల అపూర్వ మిశ్రమం.

BRAHMI-VITA
(GRANULES)
The Unique
Ayurvedic Formulation



మానసిక ప్రశాంతతకి - సుఖనిద్రకి

బ్రాహ్మీవిటలోని జటామాంసి అశ్వగంధ మూలికలు మానసిక, శారీరక వత్తిడులను దూరం చేసి, మానసిక ప్రశాంతతకి, సుఖనిద్రకి దోహదము చేస్తాయి.



వ్యాధినిరోధకం - శక్తిజనితం

బ్రాహ్మీవిటలోని శతావరి, అశ్వగంధ మరియు ఇతర మూలికల మిశ్రమం వ్యాధి నిరోధక శక్తిని పెంచి చక్కటి మనోవికాసంతో పాటు దృఢమైన ఆరోగ్యాన్ని కూడా కలిగిస్తుంది.




DECCAN AYURVEDASHRAM PHARMACY LTD.
Saidabad, Hyderabad - 500 659.